# సంతోషకరమైన
# వివాహ జీవితమునకు
# దైవ నియమములు

భక్త్‌సింగ్

ప్రథమ ముద్రణ : అక్టోబరు, 1980, ప్రతులు 5000
ద్వితీయ ముద్రణ : ఏప్రిల్ 1988, ప్రతులు 3000

పుస్తకములు కావలసినవారు ఈ క్రింది
అడ్రసుకు వ్రాయమనవి

హెబ్రోను
గోల్కొండ చౌరస్తా
హైదరాబాదు - 500 020.

# సంతోషకరమైన వివాహ జీవితమునకు దైవ నియమములు

**లేఖన భాగములు :**

ఆదికాండము 1:26, 28; ఆదికాండము 2:18-25;
యోహాను 12 : 1-3; యోహాను 16:24; ఎఫెసీ 5:17-33.

వివాహము, సృష్టియొక్క ఆరంభము నుండియే అతి పవిత్రమైన సంబంధముగా యుండవలెనని దేవుడు నిర్ణయించి యున్నాడు. ఎవరైతే, దేవుని పరలోక ఏర్పాటు ప్రకారము జత చేయబడుదురో వారు ఎల్లప్పుడు అసాధారణమైన సంతోష, ఆనందములతో నుందురని దేవుని వాక్యములో చూచు చున్నాము. ఉదాహరణముగా యెషయా 62:5లో ఇట్లు చదువుచున్నాము - "యౌవనుడు కన్యకను వరించి పెండ్లి చేసికొనునట్లు నీ కుమారులు నిన్ను వరించి పెండ్లి చేసికొనెదరు. పెండ్లి కుమారుడు పెండ్లి కూతురిని చూచి సంతోషించునట్లు నీ దేవుడు నిన్ను గూర్చి సంతోషించును." మరల యెషయా 61:10లో యిట్లు చదువుచున్నాము, "శృంగారమైన పాగా ధరించుకొనిన పెండ్లి కుమారుని రీతిగాను, ఆభరణములతో అలంకరించుకొనిన పెండ్లి కుమార్తె రీతిగాను ఆయన రక్షణ వస్త్రములను నాకు ధరింప జేసియున్నాడు. నీతి అను పైబట్టను నాకు ధరింపజేసి యున్నాడు. కాగా యెహోవాను బట్టి మహానందముతో నేను ఆనందించుచున్నాను. నా దేవుని బట్టి

నా ఆత్మ ఉల్లసించుచున్నది." ఇదే విధముగా యిర్మీయా 33:11లో యిట్లు వ్రాయబడి యున్నది - "సంతోష స్వరమును, ఆనంద శబ్దమును, పెండ్లి కుమారుని స్వరమును పెండ్లి కుమార్తె స్వరమును...యెహోవా మంచివాడు ఆయన కృప నిరంతర ముండును. సైన్యముల కధిపతియగు యెహోవాను స్తుతించుడి అని పలుకు వారి స్వరమును మరల వినబడును." ప్రకటన 19:7లో యిట్లు చూచుచున్నాము, "గొఱ్ఱెపిల్ల వివాహోత్సవ సమయము వచ్చినది; ఆయన భార్య తన్ను తాను సిద్ధపరచుకొని యున్నది; గనుక మనము సంతోషపడి ఉత్సహించి ఆయనను మహిమ పరచెదము." ఈ విధముగా దేవుని వాక్యములో నుండి తేటపడునదేమనగా, వివాహములో జతపరచబడువారు తీర్మానము చేసికొనక మునుపు అధికముగా ప్రభువు సన్నిధిలో కనిపెట్టి, ఆయన పరిపూర్ణమైన పరలోకపు ఏర్పాటు ప్రకారము జతచేయబడు వారికి సంపూర్ణమైన సంతోషమును కలుగచేయుటకు దేవుడే ఈ సంబంధమును నియమించి యున్నాడు.

ప్రభువైన యేసుక్రీస్తు, యోహాను 15:11 ప్రకారము మన సంతోషము పరిపూర్ణము చేయు నిమిత్తము ఈ లోకమునకు వచ్చి శ్రమపడి, చనిపోయి తిరిగి లేచెను. ఈ పవిత్రమైన ఐక్యత ద్వారా దేవుడు ఉద్దేశించిన ఈ సంతోషమును చాల కొద్దిమందియే తమ వివాహ జీవితములో అనుభవించుటను చూచుట విచారకరము. అనేకులు తమ వివాహ ఏర్పాట్లు చేసికొనునప్పుడు దేవుని వాక్యమును నిర్లక్ష్యపెట్టి, దానికి సరియైన స్థానము నివ్వరు.

అందును బట్టియే అనేక గృహములలో వివాదము, పోరాటమును చూచెదము. మరియు ఒకరి ద్వారా మరి యొకరికి కొద్ది ఆశీర్వాదమే యుండును. ప్రతి చోటను అసంతోషకరమైన మరియు విడిపోయిన కుటుంబములను చూచుచున్నాము. కొంత మంది ధనవంతులు తమ వివాహములలో ఎంతో డబ్బు ఖర్చు పెట్టెదరు. అయినను కొంత కాలమైన తరువాత విడిపోయెదరు. అదే విధముగా ఉన్నత విద్యనభ్యసించిన వారు కూడ కొందరు తమ వివాహ జీవితము పతనమగుట కనుగొనుచున్నారు. వారు తమ వివాహ జీవితమును ఎంతో సంతోషముతోను, నిరీక్షణతోను ప్రారంభించి, త్వరలోనే ఐక్యత కలిగి, అన్యోన్యముగా జీవించుట కష్టమని కనుగొందురు.

వాక్యమును బట్టి చూడగా ఏ వివాహమైనను జీవిత పాలిభాగస్తులుగా జతపరచబడు వారికిని, వారికి మాత్రమే కాక వారి యొద్దకు వచ్చువారికి కూడ అధికమైన ఆశీర్వాదకరముగా యుండవలసిన మూలాధారమైన ఎనిమిది దైవ నియమములను పాటించవలెను. శరీరము ఆరోగ్యవంతముగా యుండుటకు తాజాయైన గాలి, మంచి నీరు, మంచి భోజనము మరియు శరీర వ్యాయామము అవసరము. సమృద్ధియైన పంట పండుటకు మంచి నేల, ఎరువు, నీళ్ళు, కలుపు మొక్కలు తీసివేయుట మరియు తెగులు నుండి కాపాడుట అవసరము. అదే విధముగా సంతోషకరమైన వివాహ జీవితమునకు ఎనిమిది దైవ నియమములు ఉన్నవి.

# 1. దేవుని పరిపూర్ణ చిత్తము

మొదటి నియమము ఏమనగా, వివాహము చేసికొనువారు జతచేయబడుటకు ముందుగా దేవుని యొక్క పరిపూర్ణ చిత్తమును నిశ్చయము చేసికొనవలెను. వారు బాహ్యమైన రూపురేఖల వలన, శరీర సంబంధమైన ఆస్తిపాస్తుల వలన లేక లోక సంబంధమైన యోగ్యతల వలనను నడిపింప బడకూడదు. వివాహ జీవిత విషయము అనేకులకు సరియైన గ్రహింపు ఏ మాత్రమును లేదు. కొందరు సంతోషముగా నుండుట కొరకు అందము, ఐశ్వర్యము, విద్య మొదలగు వాటిపై ఆధార పడుదురు. అందుచేత చివరకు ఆశాభంగము చెందుదురు. వివాహము చేసికొనువారు ప్రభువు సన్నిధిలో, ప్రార్థనలో చాలినంత సమయము కనిపెట్టి ఆయన పరిపూర్ణ చిత్తమును స్పష్టముగా గ్రహించి, దాని విషయమై పూర్తిగా రుజువు చేసికొనుటకు ఆయనకు చాలినంత సమయము నిచ్చుట చాల అవసరము. దేవుని వాక్యము చెప్పునదేమనగా - "ఇందు నిమిత్తము మీరు అవివేకులు కాక ప్రభువు యొక్క చిత్తమేమిటో గ్రహించుకొనుడి" (ఎఫెసీ. 5:17). "మీరు ఈ లోక మర్యాదను అనుసరించక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతన మగుట వలన రూపాంతరము పొందుడి" (రోమా 12:2). దేవుని చిత్తము తెలిసికొని, దానిని చేయుట వలన మనము ఆయన అనుగ్రహము (దయ)ను పొందగలము. మత్తయి 12:50లో ప్రభువు యిట్లు చెప్పెను. "పరలోకమందున్న నా తండ్రి చిత్తము

చొప్పున చేయువాడే నా సహోదరుడును, నా సహోదరియు, నా తల్లియు ననెను." తిరిగి జన్మించిన వారిలో యేసుక్రీస్తు ప్రభువు యొక్క జీవము నదివలె ప్రవహించును. తిరిగి జన్మించని వారికి నిత్య జీవము లేదు. మరియు వారు ఎన్నడును దేవుని చిత్తమును తెలిసికొనలేరు. అందుచేతనే మేము ఏ వివాహమైనను జరిగించక పూర్వము జత చేయబడువారిని తిరిగి జన్మించితిరా? మీ పాపములు క్షమించబడినవా? నిత్య జీవ వరమును పొంది యున్నారా? అని ప్రశ్నించెదము. పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెయు తాము జతచేయబడుటను గూర్చి ప్రభువు యొక్క పరిపూర్ణ చిత్తము తెలిసికొనుటకై వారు వ్యక్తిగతముగా అధికముగా ప్రార్థన చేయవలెను. మరునాడు ఏమి జరుగునో ఎవరికి తెలియదు. మన ఆరోగ్యము చెడిపోవచ్చును లేక మన పరిస్థితులు మారిపోవచ్చును. మనమెంత కాలము జీవించెదమో మనకు తెలియదు. దేవుడు మాత్రమే అంతమును ఆరంభము నుండియే ఎరుగును. కనుక మన జీవితముల విషయమై దేవుని పరిపూర్ణ చిత్తమును ఎరుగవలెను. కీర్తన 143:10లో కీర్తనల గ్రంథకర్త యిట్లు చెప్పుచున్నాడు - "నీవే నా దేవుడవు నీ చిత్తానుసారముగా ప్రవర్తించుటకు నాకు నేర్పుము, దయగల నీ ఆత్మ సమభూమి గల ప్రదేశమందు నన్ను నడిపించును గాక." వివాహములో జతచేయ బడువారు - "ఈ వ్యక్తి ప్రభువు చేత ఆయన చిత్తానుసారముగా నా కొరకు ఏర్పరచబడిన వ్యక్తి" అని సత్యముగాను, యథార్థముగాను చెప్పగలిగి యుండవలెను. వారు బంగారము, వెండి, ఉద్యోగము లేక వస్త్రములను గూర్చి ఆలోచించక పూర్వము దేవుని చిత్తమును కనుగొనవలెను.

## 2. దైవిక ప్రేమ

రెండవదిగా, వివాహము చేసికొనువారు శరీర ఆకర్షణల మీదను, భూ సంబంధమైన ఆస్తిపాస్తుల మీదను, మరియు లోక సంబంధమైన యోగ్యతల మీదను ఆధారపడనటువంటి పవిత్రమైన, ఆత్మీయమైన దైవిక ప్రేమను ఒకరి నిమిత్తమై యొకరికి వారి హృదయములలో కుమ్మరించుమని ప్రభువును అడుగవలెను. అటువంటి ప్రేమ అంతరంగ అనుభవమై యుండవలెను. అది దేవుని వరమే. ఎఫెసీ. 5:25-27లలో ప్రభువు ఇట్లు చెప్పుచున్నాడు - "పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తు కూడా సంఘమును ప్రేమించి.... దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనెను." ఇదే హెచ్చరిక 28 మరియు 33 వచనములలో మరల చెప్పబడినది. ప్రభువు మనలనెట్లు ప్రేమించెను? మనకు అదృష్టము లేదు, యోగ్యత లేదు. ఆయనను దుఃఖపరచి, గాయ పరచినను ఆయన మనలో ప్రతి ఒక్కరిని ప్రేమించి, మన నిమిత్తమై తన దేహమును విరుగగొట్టబడుటకు అప్పగించెను. ఆయన మన సృష్టికర్త గనుక మనలను అంతగా ప్రేమించెను. మనము ఆయన కొరకు ఏమియు చేయనప్పటికిని, ఆయన మన కొరకు చనిపోయెను. భార్యాభర్తల మధ్య అటువంటి దైవిక ప్రేమ కలిగియుండుట అవసరము. వారు - "యేసుక్రీస్తు ప్రభువా, మేము నీ సన్నిధిలో నీ చేత జతచేయబడి యున్నాము. మాలో ఒకరి నిమిత్తమై యొకరికి పరలోకము నుండి నీ ప్రేమను మా హృదయములలో

కుమ్మరించుము" అని విశ్వాసముతో ప్రార్థించవలెను. సామానులు, మోటరుకారు, ఆభరణములు, బిరుదులు (డిగ్రీలు) మరి యితర ఆస్తులు సంతోషకరమైన గృహమును కలుగజేయవు. దేవుని ప్రేమయే వారి గృహమును సంతోషముగా నుంచును. వారి వివాహ జీవితము యొక్క ఆరంభము నుండియే అటువంటి ప్రేమ కొరకు ప్రభువును అడుగవలెను. "అడుగుడి మీ కియ్యబడును" అని ప్రభువు చెప్పెను (మత్తయి 7:7). మొట్టమొదట ప్రభువు జీవము వారిలోనికి ప్రవహింపవలెను. అప్పుడు పరసంబంధమైన పవిత్ర ప్రేమ వారినిద్దరిని నిజమైన పాలి భాగస్తులుగాను, స్నేహితులుగాను, జత పనివారిని గాను జతపరచును. అటువంటి ప్రేమ పరీక్షలలో, శ్రమలలో, బాధలలో అధికమగును మరియు వారిద్దరిని సన్నిహిత సంబంధములోనికి ఆకర్షించును.

## 3. యేసుక్రీస్తు ప్రభువు యొక్క శిరసత్వము

మూడవదిగా, భార్యాభర్తలిద్దరు వారి వివాహ జీవితము యొక్క ఆరంభము నుండియే ప్రతి విషయములో యేసుక్రీస్తు ప్రభువు యొక్క శిరసత్వము క్రిందికి తెచ్చుకొనవలెను. ఆయనే సంఘమునకు శిరస్సై యున్నాడు. వివాహ జీవితము యొక్క ప్రతివిషయములోను, ఆయనే శిరస్సుగా నుండుటకు ఒప్పుకొన వలెను.

యెూహాను సువార్త 12:1-3లలో మనము చూచునట్లు బేతనియలోని కుటుంబమునకు యేసుక్రీస్తు ప్రభువు శిరస్సుగా యున్నాడు. ఆరంభములో మరియ, మార్తలు యేసుక్రీస్తు ప్రభువును గౌరవనీయుడైన అతిథిగా మాత్రమే చేర్చుకొనిరి. వారు, పునరుత్థాన శక్తిని లేక మరణముపై శక్తిని అనుభవించు నిమిత్తము, వారి గృహములోనికి మరణము మరియు దుఃఖము వచ్చుటకు ప్రభువే అనుమతించెను. యేసుక్రీస్తు ప్రభువు ఒక ప్రవక్త, మహాశక్తి గలిగిన గొప్ప వ్యక్తియై యుండుట మాత్రమే గాక స్వయముగా దేవుడై యున్నాడు. దేవుడు ఒక్కడే మరణముపై (శక్తి) అధికారము గలవాడు. ఏ ఒక్కడును ఎప్పుడును మరణముపై జయము పొందలేదు. యేసుక్రీస్తు ప్రభువు - 'లాజరూ, బయటికి రమ్ము' అని చెప్పగా, చనిపోయి నాలుగు దినములు సమాధిలో ఉన్న వ్యక్తి వెంటనే బయటికి వచ్చెను. యేసుక్రీస్తు ప్రభువు యెూహాను 11:25లో చెప్పిన విధముగా ఆయనే పునరుత్థానమును, జీవమునై యున్నాడు. ఆ అద్భుతము జరుగక పూర్వము ఆయన వారి నిమిత్తము మానవుడుగా జన్మించిన తమ సృష్టికర్తయని గ్రహించలేదు. స్వయముగా ఆయనే దేవుడని వారు ఎరిగినప్పుడు వారి జీవితములను, గృహములను సంపూర్తిగా ఆయన అధీనము చేసికొనిరి. మరొక విధముగా చెప్పవలెననిన వారి మనవిని బట్టి వారి గృహమునకు ఆయన సజీవమైన శిరస్సుగా నాయెను.

సంతోషకరమైన గృహముగా యుండవలెననిన యేసుక్రీస్తు ప్రభువు చేత జతచేయబడువారు ఆయన శిరసత్వమునకు ఒప్పుకొనవలెను. వారు విశ్వాసముతో - "యేసుక్రీస్తు ప్రభువా నీవు మా సృష్టికర్తవు, సర్వాధికారము గలవాడవు, నీవు మా కొరకు మానవుడవై, మాకు బదులుగా చనిపోయి, మాలో నివసించుటకై తిరిగి లేచితివి. మా హృదయములలో, మా జీవితములలో మా అనుదిన ఏర్పాటులలో మీ అధికారమునకు సంపూర్తిగా ఒప్పుకొనుచున్నాము. మీ అనుమతి లేకుండ ఏ పనియు చేయము'' అని చెప్పవలెను. ఈ విధముగా వారి వివాహ జీవితమును ప్రారంభించవలెను. భర్త ఈ విధముగా చెప్పవలెను. "యేసుక్రీస్తు ప్రభువా, ఇది మీ గృహము. మేము మీ పిల్లలము. ఈ గృహములో నా ఇష్టము లేక నా భార్య యిష్టము కాదు గాని మీ చిత్తము మాత్రమే జరుగవలెనని కోరుచున్నాను.'' అదే విధముగా భార్య కూడ యేసుక్రీస్తు ప్రభువు యొక్క శిరసత్వమును ఒప్పుకొని ఈ విధముగా చెప్పవలెను. "అవును ప్రభువా, ఇది మా గృహము కాదు, మీ గృహము. మీరే ఈ గృహమును మాకిచ్చి యున్నారు. ఈ గృహములో నా యిష్టము లేక నా భర్త యిష్టము కాదు గాని మీ చిత్తము మాత్రమే జరుగవలెను.'' లేని యెడల భర్త భార్యతో - "నీవు నా భార్యవు నాకు లోబడవలెను. నీవు లోబడకపోతే లోబడునట్లు చేయుదును. నేనేమి చేయుదునో చూడు" అని చెప్పను. అప్పుడు భార్య - "నీ కంటె నాకు ఎక్కువ తెలియును. నేను నీకు

లోబడను" అని చెప్పను. ఈ విధముగా జగడము ప్రారంభమగును. ప్రారంభములో తలుపులు, కిటికీలు మూసికొని జగడమాడుదురు. కొంతకాలమైన తరువాత బహిరంగముగాను, వీధులలో కూడ జగడమాడుదురు. సంతోషకరమైన గృహముగా నుండవలెననిన వారు ఎక్కడికైన వెళ్ళక పూర్వము మరియు ఏదైనా చేయక పూర్వము యేసుక్రీస్తు ప్రభువుయొక్క శిరసత్వమునకు ఒప్పుకొనవలెను. వారి వివాహ జీవితమంతటిలో ఇది వారి అనుదిన అభ్యాసముగా యుండవలెను. మనము తలంచి, ఊహించిన దాని కంటె అధికముగా ఆయన మనలను ప్రేమించుచున్నాడు గనుక ఆయన చిత్తమే మనకు ఉత్తమము.

## 4. పునరుత్థానశక్తి

నాల్గవదిగా, వారి వివాహ జీవితములో ఎదుర్కొనబోవు శ్రమలు, పరీక్షలలో పునరుత్థాన శక్తిని అన్వయించుకొనవలెను. లాజరు చనిపోయి సమాధిలో నాలుగు దినములుంచబడి కంపు కొట్టుచుండెను. ప్రభువు ఆజ్ఞాపించగా సమాధిలో నుండి బయటకు వచ్చెను. అతడు యేసుక్రీస్తు ప్రభువు యొక్క పునరుత్థానశక్తికి గుర్తుగా యున్నాడు. ప్రతి విధమైన పరీక్ష, శోధన కష్టములకు ఈ శక్తి సరిపోయినది. నీవు ధనవంతుడవైనను, పేదవాడవైనను, గొప్పవాడవైనను, తక్కువవాడవైనను, చదువుకొన్నవాడవైనను, చదువురాని వాడవైనను, ఎవరివైనను సరే ప్రజలందరు సామాన్యముగా ఎదుర్కొను సమస్యలను, బలహీనతలను, శోధనలను, కష్టములను, మానవమాత్రుడవుగా

నీవును ఎదుర్కొనవలసి యుండును. పునరుత్థాన శక్తిని కోరు కొనుటయే వీటన్నిటిలో జయము పొందుటకు రహస్యమైయున్నది. వారు "యేసుక్రీస్తు ప్రభువా, మేము ఈ కష్టమును ఎదుర్కొనుచున్నాము. దీనిని ఎదుర్కొను సామర్థ్యము మాకు లేదు. దీనిని జయించుటకు మీ పునరుత్థాన శక్తిని మాకు దయచేయుము" అని విశ్వాసముతో చెప్పవలెను. ఆ శక్తి ద్వారా వారు అన్ని పరిస్థితులలో జయము పొందగలరు. వారు తమ శక్తిపై నాధారపడక పునరుత్థాన శక్తిపై ఆధారపడవలెను. ఫిలిప్పీ. 4:13లో అపొస్తలుడైన పౌలు ఇట్లు చెప్పుచున్నాడు. - "నన్ను బలపరచు వాని యందే నేను సమస్తమును చేయగలను." ఆయన పునరుత్థాన శక్తిని గూర్చి - "ఆయనను, - ఆయన పునరుత్థాన బలమును ఎరుగు నిమిత్తమును" అని ఫిలిప్పీ, 3:10లో చెప్పుచున్నాడు. భార్యాభర్తలు వారి కష్టములన్నిటిని పునరుత్థాన శక్తి ద్వారా జయించగలరు.

## 5. నిజమైన సహవాసము

ఐదవదిగా, భార్యాభర్తలు తమ ఇద్దరి మధ్య నిజమైన సహవాసము కలిగి యుండవలెను. ప్రభువు లాజరును మృతులలో నుండి లేపిన తర్వాత వారిద్దరు కలిసి భోజనము చేసి "....అక్కడ వారు ఆయనకు విందు చేసిరి. మార్త ఉపచారము చేసెను; లాజరు ఆయనతో కూడ భోజనమునకు కూర్చున్న వారిలో ఒకడు" (యోహాను 12:1,2). బల్లమీద ఉన్న భోజనము ఆత్మీయ ఆహారమును గూర్చి మాట్లాడుచున్నది. ఆరోగ్యముగా

నుండు నిమిత్తము శారీరక ఆహారము అవసరమైనట్లు మన ఆత్మలకు ఆత్మీయ ఆహారము అవసరము. ఈ ఆహారమును ప్రభువైన యేసుక్రీస్తుతో సహవాసము కలిగి యుండుట ద్వారా పొందగలము. అందు నిమిత్తము వారు ఉదయకాల భోజనము చేయక పూర్వము మోకరించి దేవుని వాక్యము చదువుటతో దినమును ఆరంభించి యిట్లు ప్రార్థన చేయవలెను - "ప్రభువా, మేము పర సంబంధమైన ఆత్మీయ ఆహారము కొరకు ఆశించుచున్నాము. మేము నీ స్వరము వినగోరుచున్నాము. దయతో మా ఇరువురితో మాట్లాడుము." వారు అటువంటి కోరికతో తమ పరిశుద్ధ గ్రంథము (బైబిలు) ఆదికాండము నుండి ప్రకటన వరకు వరుసగా, క్రమముగా చదువవలెను. అప్పుడు దేవుని వాక్యము వారికి అనుదిన ఆత్మీయ ఆహారమగును. మనము మన స్నేహితులతో కలిసి భోజనము చేయునప్పుడు, సహవాసములో అది ఎక్కువ రుచికరముగా యుండును గాన తృప్తిగా అనుభవించెదము. దేవుని వాక్యమును ఉదయము, సాయంకాలము క్రమముగా చదువుట వలన ప్రభువు నడిపింపును కోరుట వలన వారు ఆత్మీయ ఆహారమును పొందెదరు.

ఈ దినములలో కొన్ని క్రైస్తవ గృహములలో మాత్రమే క్రమముగా కుటుంబ ప్రార్థనలు జరుగుచున్నవి. కుటుంబ ప్రార్థనలు లేని కారణమున అనేక గృహములలో జగడములున్నవి. ఆరంభములో వారమునకు ఒకసారి

రహస్యముగా జగడమాడుదురు. కాని తరువాత అనుదినము, బహిరంగముగా జగడమాడుదురు. వారి గృహములలో కుటుంబ ప్రార్థనలు లేని కారణమును బట్టి వారి పిల్లలుకూడ మొండి వారుగాను, లోబడనొల్లని వారుగాను అగుదురు. కనుక భార్యాభర్తలు కుటుంబ ప్రార్థనను నిర్లక్ష్యము చేయకూడదు. సాధ్యమైనప్పుడెల్ల ఒకరితో నొకరు తమ ఆత్మీయ అనుభవములను పంచుకొనుచు, ఏ విధమైన మానవ బలహీనతయైనను, లోపమైనను ఉన్నయెడల ప్రేమతో, ఓర్పుతో ఒకరికొకరు సహాయము చేసికొనవలెను.

## 6. సంతోషకరమైన సేవ

ఆరవదిగా, సాధ్యమైనంత మట్టుకు, భార్యాభర్తలు అక్కరలో యున్న వారి యెడల ప్రేమ చూపుట, గొప్ప ఆధిక్యత అని యెంచి యితరులకు సంతోషముగా సేవ చేయుటకును ప్రయత్నము చేయవలెను. వారు ఏమి చేసినను కొలొస్స. 3:23లో చెప్పబడిన ప్రకారము ప్రభువు నిమిత్తమని చేయవలెను.

యేసుక్రీస్తు ప్రభువు, లాజరు కలిసి భోజనము చేసినప్పుడు మార్త సంతోషముతో ఉపచారము చేసెను. అంతకు ముందు ఆమె సణుగుగొణుగులతో, ఫిర్యాదులతో, కోపముతో, అసూయతో నిండి యుండుటను లూకా 10:40లో చూచుచున్నాము. కాని తరువాత మార్చబడెను. కొంతమంది భర్తలు వారి భార్యల విషయమై యిట్లు మాట్లాడుదురు - "నా భార్య చాలా కష్టపడి, పనిచేస్తుంది. శుభ్రముగా, తెలివిగా, ఎంతో చురుకుగా

పనిచేస్తుంది. అయితే ఆమెకు చాలా చెడ్డ కోపము. ఆమెకు కోపము వచ్చినప్పుడు యింటిలో ఉన్న వారందరు భయపడి వణకవలెను." సంతోషకరమైన వివాహ జీవితమునకు, భార్యాభర్తలిద్దరు యితరులకు సంతోషముతో, ఉత్సాహముతో ఇష్టపూర్వకముగా సేవ చేయవలెను. వారి హృదయములలో అసూయ, ద్వేషము, కోపము, సణుగు గొణుగు లేకుండ యుండవలెను. క్రైస్తవ గృహము, పేదలకు, అక్కరగలవారికి, అనారోగ్యముగా యున్నవారికి సేవా గృహముగా యుండవలెను. ఆ గృహము అందరికి సమానముగా సేవచేయు ప్రేమా గృహముగా యుండవలెను.

## 7. ప్రభువును ఆరాధించుట

ఏడవదిగా, భార్యాభర్తలు మరియవలె ప్రభువు యొక్క కృపా కనికరములను బట్టి ఆయనకు కృతజ్ఞులై యుండవలెను. "అప్పుడు మరియ మిక్కిలి విలువగల అచ్చజటామాంసి అత్తరు ఒక సేరున్నర యెత్తు తీసుకొని, యేసు పాదములకు పూసి, తన తలవెండ్రుకలతో ఆయన పాదములు తుడిచెను; ఇల్లు ఆ అత్తరు వాసనతో నిండెను" (యోహాను 12:3). రెండు కారణములను బట్టి మరియ యేసు ప్రభువు పాదములకు ప్రశస్తమైన అత్తరు పూసెను. చనిపోయి నాలుగు దినములు సమాధిలో నుండి తిరిగి లేపబడిన తన సహోదరుని బట్టి తన హృదయము కృతజ్ఞతతో నిండియుండెను. రెండవదిగా యేసుక్రీస్తు ప్రభువు సామాన్య మానవుడు కాదనియు, మానవుల రక్షణార్థము మానవుడుగా

అయిన దేవుడే అని తెలిసికొనెను. కావున హృదయ పూర్వకమైన భక్తి వైరాగ్యములతో అత్తరును ఆయన పాదములకు పూసెను. సంతోషకరమైన గృహముగా నుండుటకు భార్యాభర్తలిద్దరు ప్రభువు యెడల భక్తి కలిగి ఆయనను ఘనపరచి ఆరాధించ వలెను. ప్రభువు యొక్క కృప, కనికరము, ప్రేమ, నమ్మకత్వమును బట్టి ప్రతిదిన ఆరంభమందును ఆరాధన పాటలతో ఆరంభించ వలెను. అదే విధముగా వినయముతో కూడిన నిజమైన భక్తితో దినమును ముగించవలెను. వారి విశ్వాసము బలపరచబడి ప్రభువును అధికముగా ప్రేమించగలుగుదురు. వారు ఆరాధనా కూడికలలో సంపూర్తిగా పాలు పొందవలెను. ఇటువంటి గృహము పరలోకపు రుచిని ముందుగనే ఈ లోకములో అనుభవించునట్లు చేయును.

## 8. మూడంతల ఐక్యత

ఎనిమిదవదిగా, భార్యాభర్తల యొక్క ఐక్యత ఆత్మ, జీవము, శరీరముల మూడంతల ఐక్యతయై యుండవలెను. 1థెస్సలొనీకయులు 5:23 ప్రకారముగా మన వ్యక్తిత్వము మూడింటి కలయికయై యున్నది. "సమాధానకర్తయగు దేవుడు మిమ్మును సంపూర్ణముగా పరిశుద్ధ పరచును గాక. మీ ఆత్మయు జీవమును, శరీరమును మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడ యందు నిందారహితముగాను, సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడును గాక." ప్రసంగి 4:12లోయిట్లు చదువుచున్నాము - "మూడు పేటల త్రాడు త్వరగా తెగిపోదుగదా?" గ్రామములలో

పెద్ద పెద్ద బరువులను లాగుటకు బలమైన త్రాడు కావలసినప్పుడు ప్రజలు మూడు త్రాళ్ళను తీసికొని వాటిని కలిపి ఒక్కటిగా అల్లుదురు. అప్పుడు అది బలముగా యుండును. మూడంతల ఐక్యతను అర్థము చేసికొనవలెననిన, దేవుడు మనలను ఆత్మ, జీవ, శరీరముల మూడింటి కలయికగా ఎందుకు చేసెనో మనము తెలిసికొనవలెను. ఆదికాండము 2:7లో యిట్లు చూచుచున్నాము - "దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవ వాయువును ఊదగా నరుడు జీవాత్మ అయెను."

ఇప్పుడు శరీరమనగానేమో, జీవమనగానేమో, ఆత్మయనగానేమో చూచెదము; ఎముకలు, కండరములు, రక్తము శరీరమగుచున్నది. జీవము యొక్క మూడంతల కలయిక యేదనగా, ఆలోచించుటకు, నేర్చుకొనుటకు, తెలిసికొనుటకు అవసరమైన తెలివితేటలు : తలిదండ్రులు, సహోదరులు, సహోదరీలు, భర్త లేక భార్య, స్నేహితులు, బంధువులు మొదలగు వారి నెవరినైనా ప్రేమించవలెనను భావోద్రేకము; ఏదైనా ఒక విషయమై నిర్ణయము చేసికొను చిత్తశక్తి. అవును లేక కాదు అని చెప్పగలుగునట్లు దేవుడు ప్రతి మానవునికి స్వేచ్ఛను అనుగ్రహించెను. ఆయన ఎవరిని బలవంతము చేయడు. ఆత్మ కూడ మూడింటి కలయికయై యున్నది. మొదటిది మనస్సాక్షి లేక అంతరంగస్వరము, మనము తలంపు, మాట, క్రియలలో పాపము చేయక ముందే హెచ్చరిక చేయును. ఏ పాపమునైన

చేయుటకు ముందు మన మనస్సాక్షిని చంపుకొనవలెను. ఉదాహరణమునకు, నేనొక అబద్ధము చెప్పగోరుచున్నప్పుడు, నా మనస్సాక్షి నన్నిట్లు హెచ్చరించును - "జాగ్రత్త, అబద్ధము చెప్పవద్దు." అయితే నేను నా మనస్సాక్షితో యిట్లు చెప్పుదును. - "నీవు ఊరకుండుము." దీని అర్థమేమనగా మనస్సాక్షిని చంపిన తరువాతనే పాపము చేయుదుము. రెండవది, అదృశ్యుడైన దేవుని తెలిసికొనవలెనను అంతరంగిక వాంఛ. ప్రతి మానవుడు దేవుడెవరు? తన సృష్టికర్త ఎవరు? ఆయన ఎక్కడ ఉన్నాడు? ఆయనను కనుగొనుట ఎట్లు అని తెలిసికొన గోరుచున్నాడు. మూడవది, అంతర్జ్ఞానము. కారణము ఎరుగకుండగనే ఎక్కడికైనా వెళ్ళుటకు లేక ఏదైనా కొనుటకు లేక ఏదైనా చేయుటకు అకస్మాత్తుగా ఒక తలంపు కలుగును.

దేవుడు మానవుని తన స్వరూపమందు, తన పోలిక చొప్పున చేసెనని ఆదికాండము 1:26లో చూచుచున్నాము. పరిశుద్ధుడైన, ప్రేమగల దేవుడు మానవుడు తనతో విడిపోని సహవాసము కలిగియుండునట్లుగా చేసెను. పాపము ప్రవేశించినప్పుడు పరిశుద్ధుడైన దేవునితో యున్న నిజమైన సహవాసము నుండి వేరు చేయబడెను. ఎందు చేతననగా - ".....పరిశుద్ధత లేకుండ ఎవడును ప్రభువును చూడడు" అని హెబ్రీ. 12:14లో చెప్పబడి యున్నది. 1 పేతురు 1:16లో యిట్లు చదువు చున్నాము - "నేనుపరిశుద్ధుడనై యున్నాను కనుక మీరును పరిశుద్ధులై యుండుడి" మరియు మత్తయి 5:8లో యిట్లు చూచుచున్నాము,

- "హృదయ శుద్ధి కలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు." ఈ విధముగా మనము పరిశుద్ధత లేకుండ దేవుని చూడలేమని ఎంతో స్పష్టముగా తెలియుచున్నది. పాపమును బట్టి మన ఆత్మలోనికి మరణము ప్రవేశించెను. పాపులముగా మనము మూడంతల పతనమునకు దిగజారిపోతిమి. మన ఆత్మ చనిపోయెను. జీవము అంధకారమయ మయ్యెను. మన శరీరము పరిశుద్ధాత్మకు ఆలయముగా నుండుటకు చేయబడినప్పటికిని అపవిత్రమయ్యెను. అందుచేత మనము పాపములో జీవించినంత కాలము దేవుని సన్నిధిని అనుభవించలేము. ఆయన శక్తిని అనుభవించలేము. ఆయన స్వరమును వినలేము. ఆయన మనస్సును తెలిసికొనలేము. మన ఆత్మ చనిపోయినందువలన ఆయన యొక్క నిజమైన శాంతిని అనుభవించలేము. మన జీవము అంధకారమయ మయ్యెను. కనుక మన తెలివితేటలను, భావోద్రేకములను చెడుగా ఉపయోగించుకొందుము. మనము స్వార్థపరులముగాను, గర్విష్ఠులముగాను ఉండి, మనస్సులో ద్వేషము, కోపము, అసూయ, అనుమానము, నా యిష్టమే జరుగవలెను అను తలంపులు కలిగియుందుము. మన శరీర అవయవములను చెడుగా ఉపయోగించుకొనుట వలన శరీరమునకు అపవిత్రత కలుగజేయుదుము.

యోహాను 4:24లో యిట్లు చదువుచున్నాము - "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను." మనము అంతరంగములో

శుద్ధిచేయబడితేనే తప్ప సజీవుడైన, పరిశుద్ధుడైన దేవునితో విడిపోని సహవాసమును కలిగియుండలేము. 1 యోహాను 1:9; హెబ్రీ 9:14 ప్రకారము యేసుక్రీస్తు రక్తము ఒక్కటే మన మనస్సాక్షిని శుద్ధిపరచి, పాపపు మరకలన్నిటి నుండి పవిత్ర పరచును. పరిశుద్ధాత్మ మన పాపములను గూర్చి మనలను ఒప్పించి, నిజముగా వాటికొరకు పశ్చాత్తాపపడి ఒప్పుకొనుటకు సహాయ పడినప్పుడు, యేసుక్రీస్తు ప్రభువు మనస్థానములో చనిపోయి మన పాపములను పాతిపెట్టుటకు పాతిపెట్టబడెననియు, మనకు జీవముగాను, నీతిగాను ఉండుటకు మనలో జీవించుటకు తిరిగి లేచెనని నమ్మిన వెంటనే మనము క్షమించబడుదుము. మన పాపములన్నియు ఆయన రక్తములో కడుగబడి ఆయన సన్నిధిని బలముగా అనుభవించెదము.

దోషభరితమైన మన మనస్సాక్షి ప్రభువు యొక్క ప్రశస్త రక్తముతో కడుగబడినప్పుడు మూడంతలుగా మార్పు చెంది పైకెత్తబడుదుము. పవిత్రము చేయబడిన మన ఆత్మ లోనికి పరిశుద్ధాత్మ వచ్చుట వలన చనిపోయిన మన ఆత్మ జీవించు ఆత్మ అయినది. దీనినే నూతన జన్మ అందురు. ఈ అనుభవము తరువాతనే దేవుని వాక్యములో మరుగుగా నున్న మర్మములను గ్రహించగలుగుదుము. ప్రార్థనలో దేవునితో స్వేచ్ఛగా మాట్లాడి, ఆయన పరిపూర్ణ చిత్తమును చేయగలుగుదుము. అంధకార మయమైన మన జీవము వెలిగింపబడును. మన భావోద్రేకములను సరిగా ఉపయోగించుకొని మనపై అయిష్టముగా నున్నవారిని

ప్రేమించుదుము. పైనున్న వాటిపై మనస్సు నుంచుట వలన అన్ని విషయములలో దేవుని పరిపూర్ణ చిత్తమును చేయ గలుగుదుము. మన శరీరములు కూడ పరిశుద్ధపరచబడును. పరిశుద్ధాత్మకు ఆలయముగా నుండ గోరుచు మన అవయవములలో దేనిని చెడుగా ఉపయోగించకుండ యుందుము.

మూడంతల ఐక్యత యొక్క ప్రధానమైన దైవ నియమములను అనుసరించువారు సంతోషకరమైన, ఫలవంతమైన వివాహ జీవితము కలిగి యుండగలరు. వారు మొట్టమొదటిగా ఆత్మీయమైన ఐక్యత కొరకు ఆశించవలెను. దాని భావమేమనగా వారు మోకరించి దేవుని వాక్యము చదువుటతో దినము ఆరంభించి అదే విధముగా ముగించవలెను. వారు ప్రతి విషయములో కలిసి మోకరించి, ప్రార్థించి దేవుని చిత్తము తెలిసికొనవలెను. సాధ్యమైనంత మట్టుకు వారిద్దరు దేవుని యింటికి కలిసి వెళ్ళుచు ప్రభువును ఆరాధించవలెను. చాల మంది భర్తలు - "నేను నా ఉద్యోగములో, వ్యవహారములలో చాల పని కలిగియున్నాను గనుక నా భార్య ప్రార్థన చేస్తే చాలును" అని అందురు. కాని కలిసి ప్రార్థన చేయుట అవసరము. ఆత్మీయమైన ఐక్యత యుండవలెననిన వారి ప్రేమ మానవ ఆకర్షణల మీద, లోక సంబంధమైన ఆస్తిపాస్తుల మీద, విద్య మీద ఆధారపడక, ఎటువంటి స్వార్థముతో కూడిన ఉద్దేశము లేకుండ ఒకరినొకరు ప్రేమించు కొనవలెను. వారిద్దరు ఒకే

తలంపు కలిగి, ఒకే విధమైన స్నేహితులను కలిగి, ఒకే విధమైన శ్రద్ధ కలిగి, ఒకే విధమైన భావములను (రహస్యములను) కలిగి యుండవలెను. మూడవదిగా, వారి శారీరక ఐక్యత ఎంతో పవిత్రముగా యుండవలెను. ఒకరి విషయమై ఒకరు గౌరవము, శ్రద్ధ కలిగి, ఒండొరుల అక్కరల విషయమై ప్రత్యేకమైన జాగ్రత్త తీసికొనవలెను. వారి వివాహ జీవితము ప్రార్థనా పూర్వకముగా జీవించుచూ, దైవ సంతానము కలుగజేయు నిమిత్తము జత చేయబడిరని జ్ఞాపకముంచుకొనవలెను. "....దేవుని చేత సంతతి నొందవలెనని అతడు యత్నము చేసెను గదా" (మలాకీ 2:15).

ఈ విధముగా మన వ్యక్తిత్వము యొక్క నిజ స్వభావమును ఎరుగుట వలన శరీరమునకు, ఆత్మకు మధ్యగల వ్యత్యాసమును సులభముగా వివేచించవచ్చును. చాల మంది - మేము దేవుని ఆత్మ ద్వారా నడిపింపబడితిమని చెప్పుదురు గాని వాస్తవముగా శరీరము ద్వారానే నడిపించబడి, సులభముగా మోసపోయిరి. సాతాను మన విశ్వాసమును బలహీనము చేయుటకు ప్రయత్నించి, అనేక కుయుక్తి పన్నాగముల ద్వారా, మనము కలిగియున్న నిజమైన ప్రేమను, సమాధానమును దొంగిలించును. ప్రభువు యొక్క పరిపూర్ణ చిత్తము ననుసరించి ఆత్మలో ప్రార్థన చేయుట వలన మరియు సమస్తము పరిశుద్ధాత్మ నడిపింపు ప్రకారము చేయుట వలన, మనము దేవుని దయను అనుభవించి ఆయన పరలోకపు యేర్పాటులో యుంచబడెదము.

సామాన్యమైనటువంటి ఈ దైవ నియమములను పాటించుట వలన లోకమందు ఏ భాగమునకు చెందిన, ఏ భార్యాభర్తలైనను సంతోషకరమైన వివాహ జీవితము జీవించగలరు. ప్రభువుచేత వివాహములో జతచేయబడు వారందరి హృదయములలో ఈ దైవ నియమములను ప్రభువు వ్రాయవలెనని మా ప్రార్థన. ఈ నియమములను పాటించుట వలన వారి గృహము సంతోషకరముగాను, ఆశీర్వాదకరముగాను ఉండును. వారి గృహము సమాధాన గృహముగాను, ఆనంద గృహముగాను, ప్రేమా గృహముగాను, సేవా గృహముగాను, దైవసన్నిధిగల గృహముగాను, విశ్వాస గృహముగాను, సహవాస గృహముగాను, దేవుని నామము ఘనపరచబడు గృహముగాను ఉండును. ఇటువంటి గృహము ద్వారా అనేకులు ఆశీర్వదించబడెదరు. ఇటువంటి నిజ క్రైస్తవ గృహము పరలోకపు రుచిని ముందుగానే ఈ భూలోకములో అనుభవింపచేయును.

◆ ◆ ◆